క్లుప్తంగా

పారిశుధ్య పనుల పరిశీలన



నెల్లూరు(బారకాసు): నగరంలోని 4వ డివిజన్ శ్రీరామ్‌నగర్ కాలనీలో చేపడుతున్న డ్రైనేజీల్లో పూడికతీత పనులను ఎంహెచ్‌ఓ వెంకటరమణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్లలోని డ్రైనేజీల్లో పూడికతీత పనులను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని తెలిపారు. డ్రైనేజీల్లో చెత్త, ప్లాస్టిక్ కవర్లు వేయడం వల్ల మురుగు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. ఎవరైనా డ్రైనేజీల్లో వ్యర్థాలు పడేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బేల్దారి కూలీ మృతి




నెల్లూరు(క్రైమ్): భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి జారిపడి గుర్తుతెలియని బేల్దారి కూలీ(65) మృతి చెందిన ఘటన చంద్రమౌళినగర్‌లో శనివారం చోటుచేసుకుంది. వివరాలు..నగరానికి చెందిన టీ శ్రీనివాస్ బేల్దారి మేస్త్రీ. ఆయన చంద్రమౌళినగర్ ఆరోవీధిలో నూతన భవన నిర్మాణ పనులు చేస్తున్నారు. శనివారం కరెంటాఫీసు సెంటర్ వద్ద నుంచి బేల్దారి కూలీలను తీసుకెళ్లారు. అందులో ఓ కూలీ ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి జారిపడడంతో తీవ్రగాయాలయ్యాయి. సదరు వ్యక్తిని సహచర కూలీలు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. ఈ మేరకు వేదాయపాళెం పోలీసులకు సమాచారం అందడంతో ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి వివరాల కోసం కరెంటాఫీస్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో ఆరాతీసినా తెలియరాలేదు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94407 96304, 94407 96309 నంబర్లను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ కోరారు.

సెమిస్టర్ ఫలితాల్లో జెనెక్స్ సత్తా



నెల్లూరు(అర్బన్): విక్రమ సింహపురి వర్సిటీ విడుదల చేసిన ఎంబీఏ, ఎంసీఏ రెండో సెమిస్టర్ ఫలితాల్లో జెనెక్స్ విజన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, టెక్నాలజీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారని ఆ కళాశాల డైరెక్టర్లు వెంగళరెడ్డి, కొండలరావు తెలిపారు. ముత్తుకూరు రోడ్డు, పార్థసారధినగర్‌లోని జెనెక్స్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శనివారం వారు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంసీఏ విభాగంలో గోపిశ్రీ, మణికంఠ, వరప్రసాద్ 9.29 సీజీపీఏ సాధించారని తెలిపారు. ఎంబీఏ, ఎంసీఏలలో ఎక్కువ మంది విద్యార్థులు 80శాతానికిపైగా మార్కులతో ఉత్తీర్ణత సాధించారని వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస తేజ పాల్గొన్నారు.

నైపుణ్య కోర్సులతో ఉపాధి



నెల్లూరు(అర్బన్): నైపుణ్య కోర్సులను పూర్తి చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు పొందవచ్చని డీకేడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్ గిరి తెలిపారు. వృక్ష శాస్త్రంలో ఎకో ఫ్రెండ్లీ పరికరాల తయారీ కోర్సులో 30 మంది, పుట్టగొడుగుల పెంపకం కోర్సులో మరో 20 మంది విద్యార్థినులు శిక్షణ పూర్తి చేశారు. వీరికి కళాశాలలో శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గిరి మాట్లాడుతూ ఇలాంటి కోర్సులను పూర్తి చేసే వారు సొంతంగా స్టార్టప్ కంపెనీలను ప్రారంభించి ఉత్పత్తి చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రమణరావు, వృక్ష శాస్త్ర విభాగాధిపతి రాజరాజేశ్వరి, అధ్యాపకుడు ఉమాశంకర్‌రాజు పాల్గొన్నారు.

రేపు ప్రపంచ నృత్య దినోత్సవం

నెల్లూరు(బృందావనం): కేతా అంకులు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నగరంలోని నర్తకి సెంటర్‌లో ప్రపంచ నృత్య దినోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు అభినవ ఘంటసాల పాటూరు శ్రీనివాసులు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వానపత్రికలను శనివారం రాత్రి నర్తకిసెంటర్‌లో కళాకారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాటూరు శ్రీనివాసులు మాట్లాడుతూ కళలు, కళాకారులను ప్రోత్సహించేందుకు కేతా సుబ్బారావు చేపడుతున్న కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం, ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జయప్రకాష్, ఎస్ మురళీమోహన్‌రావు, సీహెచ్ ప్రసాద్‌బాబు, సత్యం, ప్రసాద్, రమేష్, శ్రీనివాసులు,మహేష్, రాము,షఫీ పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు సీఎం జగన్ పెద్దపీట



15వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న విజయసాయిరెడ్డి, ఖలీల్‌అహ్మద్

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి

నెల్లూరు(బృందావనం): గతంలో ఏ ముఖ్యమంత్రి ఇవ్వని విధంగా బ్రాహ్మణ సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇచ్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి అన్నారు. నగరంలోని 15వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్‌తో కలిసి శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ గణేశం సుజాత, డివిజన్ ఇన్‌చార్జి గణేశం వెంకటేశ్వర్లురెడ్డితో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించే కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన కోన రఘుపతిని డిప్యూటీ స్పీకర్‌గా చేసిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారని వివరించారు. నెల్లూరులో ప్రతి నెలా రెండుసార్లు ప్రజాదర్బారు నిర్వహించి ప్రజాసమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి నెల్లూరు ఎంపీగా తనను, నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా ఖలీల్‌అహ్మద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియను నిబద్ధతతో పూర్తి చేయండి

- నెల్లూరు సిటీ ఆర్వో వికాస్‌మర్మత్



మాట్లాడుతున్న ఆర్వో వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): ఎన్నికల సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించి ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని నెల్లూరు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్‌మర్మత్ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎన్నికల సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై శనివారం ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగిసే వరకు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని నోడల్ అధికారులకు సూచించారు. ఇప్పటికే పోలింగ్ సిబ్బందికి రెండు విడతలుగా శిక్షణ ఇచ్చామని, మూడో విడత శిక్షణకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఎన్నికలపై ఓటర్లకు అవగాహన కల్పించి 85 శాతానికి పైగా పోలింగ్ జరిగేలా చూడాలన్నారు. ఓటరు ఐడీ కార్డులు, ఓటర్ స్లిప్పుల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఒకే ప్రాంగణంలో మూడు కన్నా ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉంటే సీసీ కెమెరాలు, హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేయడంతో పాటు ఓటర్లకు నీడ, తాగునీటి వసతులు కల్పించాలని ఆదేశించారు. అనంతరం పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్, పీవీసీ, ఈవీఎంల నిర్వహణ, ఎన్నికల మెటీరియల్ పంపిణీ, ఓటరు స్లిప్పుల పంపిణీ, తదితర అంశాలపై మాస్టర్ ట్రెయినర్ల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జిల్లా శిక్షణాధికారి బాపిరెడ్డి, అదనపు కమిషనర్ శర్మద, టీపీఆర్వో ప్రసాద్, మేనేజర్ ఇనాయతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 150 కుటుంబాలు చేరిక



రూపేష్‌కు పార్టీ కండువా వేస్తున్న ఆదాల



పార్టీలో చేరిన టీడీపీ మద్దతుదారులతో ఆదాల

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గ పరిధిలోని ఆటోనగర్‌కు చెందిన 150 మంది టీడీపీ మద్దతుదారులు ఆ పార్టీని వీడి శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మినీబైపాస్‌లోని తన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మహబూబ్ బాషా, ఆసిఫ్‌బాషా, రిజ్వాన్, సాజీద్ బాషా, ఖాదర్, రహీం, మజీద్, సమీవుల్లా, ఇంతియాజ్, షాను, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీ సీనియర్ నాయకులు బట్టేపాటి నరేందర్‌రెడ్డి, జిల్లా మైనార్టీ నాయకులు ఎస్డీ సలీం తదితరులు పాల్గొన్నారు.

17వ డివిజన్ టీడీపీ కన్వీనర్ రూపేష్ చేరిక

17వ డివిజన్ టీడీపీ కన్వీనర్ రూపేష్ తన వర్గంతో కలిసి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మినీబైపాస్‌లోని తన కార్యాలయంలో ఆదాల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

- 32వ డివిజన్‌కు చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. స్థానిక కార్పొరేటర్ తాళ్లూరు అవినాష్, నాయకులు స్వర్ణ వెంకయ్య ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి మినీబైపాస్‌లోని తన కార్యాలయంలో ఆదాల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పీ వెంకటేశ్వర్లు, ఎం శివాజీ, వెంకటరమణ, కే సుబ్రహ్మణ్యం, మస్తానయ్య, మణికంఠ, ముసలయ్య, ఏడుకొండలు, వెంకటేశ్వర్లు, ఎం ఆది, ఎం హరి, కిషోర్ తదితరులు ఉన్నారు. పార్టీ నాయకులు నాయకులు బట్టేపాటి నరేందర్‌రెడ్డి, బద్దెపూడి రవీంద్ర, ఉదయగిరి నరసింహులుగౌడ్, బాబ్జీయాదవ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని దీవించండి



53వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



54వ డివిజన్‌లో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53,54 డివిజన్ల పరిధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. 53వ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరపురం, వాటర్‌ట్యాంకు, నల్లకాలువ, పునరావాస కాలనీ ప్రాంతాల్లోని ఇంటింటికి వైఎస్సార్‌సీపీ నాయకులు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మే 13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్ అహ్మద్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ నాయకులు వెంగళరెడ్డి, నాగసుబ్బారెడ్డి, ప్రసాద్, కళ్యాణ్, గురవయ్య, విజయ్, విమల, నిర్మల, తదితరులు, పాల్గొన్నారు.

- 54వ డివిజన్ పరిధిలోని చిన్నమసీదు, నేతాజీ వీధి, ఇస్లాంపేట, పరిసర ప్రాంతాల్లోని ఇంటింటికి వైఎస్సార్‌సీపీ నాయకులు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు జమీర్ అహ్మద్, నాయకులు మస్తాన్, ఖయ్యూం, జెస్సీ, అన్వర్, అస్లాం, జాకీర్, శోభన్, కరిముల్లా, తదితరులు, పాల్గొన్నారు.

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో అమలు చేసిన పేదల మేనిఫెస్టోను మరింత బలోపేతం చేస్తూ 2024 ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయడం హర్షణీయమని 54వ డివిజన్ కార్పొరేటర్ సఫియా ముజీర్ పేర్కొన్నారు. శనివారం ఆమె బర్మాషెల్‌గుంటలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా ఖలీల్ అహ్మద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఐదేళ్లలో పెన్షన్‌ను రూ.3,500కు పెంచనున్నట్లు తెలిపారు. అమ్మఒడి, ఆసరా, చేయూత పథకాల మొత్తాన్ని పెంచడం హర్షణీయమన్నారు.

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థులు విజయసాయిరెడ్డి, ఖలీల్‌అహ్మద్‌కు మద్దతుగా నగరంలోని 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించే కరపత్రాలను అందజేశారు.



54వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సఫియాముజీర్



14వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కర్తం

వైద్యులతో ఆత్మీయ సమావేశం



నెల్లూరు సిటీ: నగరంలోని అనీల్ గార్డెన్స్‌లో వైద్యులతో వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ అభ్యర్థులు విజయసాయిరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి, ఆదాల మాట్లాడుతూ తమకు సంపూర్ణ మద్దతు ఇచ్చినందుకు వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలోని వైద్యులు పాల్గొన్నారు.

నేటి భారతం-సవాళ్లుపై సదస్సు నేడు

నెల్లూరు(అర్బన్): అపోలో ఆస్పత్రి సమీపంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నేటి భారతం-సవాళ్లు అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించనున్నట్లు డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల సూపరింటిండెంట్ రాజేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై ఉపన్యసిస్తారని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ట్రస్ట్ చైర్మన్ చంద్ర రాజగోపాల్, ఆలిండియా లాయర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు అంకయ్య, తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ముగిసిన ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని సంతపేట ఆంజనేయస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రితో ముగిశాయి. చివరి రోజు దవనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా డాక్టర్ కొండపల్లి సత్యనారాయణరావు వ్యవహరించారు. ఆలయ ఈఓ దర్గయ్య, మహేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా గజ వాహన సేవ



నెల్లూరు(బృందావనం): ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండరామస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం తీర్థవాది, పట్టాభిషేకం, అవభృత స్నానం నిర్వహించారు. రాత్రి గజ వాహన సేవ వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా కొంజేటి నారాయణ, కొల్లూరు లక్ష్మీ నరసింహం, కొల్లూరు మనోహర్‌కుమార్ దంపతులు వ్యవహరించారు.

బాహుబలి ఎగ్జిబిషన్ ప్రారంభం



నెల్లూరు(బృందావనం): వేసవి సెలవుల్లో కుటుంబ సమేతంగా ఆనందంగా గడిపేలా వైఎంసీఏ గ్రౌండ్‌లో బాహుబలి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించినట్లు నిర్వాహకుడు ఎస్కే బాబు తెలిపారు. వైఎంసీఏ గ్రౌండ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాలమైన మైదానంలో బాహుబలి సెట్టింగ్‌లతో పాటు టోరాటోరా, జెయింట్‌వీల్, బ్రేక్‌డాన్స్, డ్రాగన్ ట్రెన్‌తో పాటు చిన్నపిల్లల కోసం అనేక రైడ్లు ఏర్పాటు చేశామని వివరించారు. చేనేత, హస్తకళలకు సంబంధించిన స్టాళ్లతో పాటు నోరూరించే ఫుడ్‌స్టాళ్లను సందర్శకుల కోసం ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ఎగ్జిబిషన్ ఉంటుందని, కుటుంబ సమేతంగా వచ్చి వీక్షించి ఆనందించాలని కోరారు.

మాట నిలబెట్టుకునే వ్యక్తి జగన్



ఎన్నికల ప్రచారంలో అభివాదం చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: ఒక్కసారి మాట ఇచ్చాడంటే కట్టుబడి ఉంటారు..ఎంత కష్టమొచ్చినా ఇచ్చిన మాటను నిలబెట్టుకునే వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ మండలం కొమ్మరపూడి, ములుముడి గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే ఒక నమ్మకం అని మరోసారి నవరత్నాల ప్లస్ మేనిఫెస్టో ద్వారా నిరూపితమైందన్నారు. నవరత్నాల ప్లస్ మేనిఫెస్టో ప్రజలకు అదనపు ప్రయోజనాలను చేకూర్చేలా ఉందన్నారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.3వేలు సామాజిక పింఛన్‌ను రూ.3,500కు పెంచనున్నట్లు తెలిపారు. చంద్రబాబులా ఆచరణ సాధ్యంకాని హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు వాటిని తుంగలో తొక్కేలా జగన్ వ్యవహరించరన్నారు. ప్రజలకు మేలు చేకూరేలా అమలు చేయగల వాటినే మేనిఫెస్టోలో పొందుపరిచారని తెలిపారు. ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను యథావిధిగా కొనసాగిస్తూ రానున్న ఐదేళ్లలో మరింత అదనపు ప్రయోజనం చేకూరేలా మ్యానిఫెస్టోను విడుదల చేశారన్నారు. డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆనం విజయకుమార్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డి, మల్లు సుధాకర్‌రెడ్డి, స్వర్ణా వెంకయ్య, లంక రామశివారెడ్డి, రవీంద్ర, నరసింహులు గౌడ్, కొమ్మరపుడి నాయకులు నెట్టెం శ్రీధర్‌నాయుడు, వల్లభనేని రమణమ్మ, కాకి మనోహర్, దొడ్ల మస్తానయ్య, సీనయ్య, బండి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాతలను ఆశీర్వదించండి



ప్రచారం నిర్వహిస్తున్న ఆదాల హిమబిందు

నెల్లూరు సిటీ: త్వరలో జరిగే ఎన్నికల్లో అభివృద్ధి ప్రదాతలను ఆశీర్వదించాలని ఆదాల హిమబిందు కోరారు. శనివారం ఆమె తన తండ్రి, వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా 26వ డివిజన్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన తండ్రి రూరల్ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టాక కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. ఎక్కడికి వెళ్లినా తన తండ్రి చేపట్టిన అభివృద్ధి పనులు కనిపిస్తున్నాయన్నారు. రూరల్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యేగా ఆదాలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ నగర మహిళా అధ్యక్షురాలు కాకుటూరు లక్ష్మీసునంద, ఏపీఎంఎస్ఎంఈ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, పార్టీ నగర ఉపాధ్యక్షుడు వేలూరు శ్రీధర్‌రెడ్డి, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాశం తిరుపతి, మహిళా నాయకురాలు ముంగమూరు భార్గవిరెడ్డి, 26వ డివిజన్ ఇన్‌చార్జి షేక్ బాబు, పార్టీ నగరాధ్యక్షుడు సన్నపరెడ్డి పెంచలరెడ్డి, 27వ డివిజన్ అధ్యక్షుడు సన్నపరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూర్‌బాషా భవన నిర్మాణానికి కృషి

- ఆత్మీయ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ విజయసాయిరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరులో నూర్‌బాషాలకు ప్రత్యేక భవన నిర్మాణంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి అన్నారు. నగరంలోని ఓ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన నూర్‌బాషాల ఆత్మీయ సమావేశానికి విజయసాయిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నూర్‌బాషాల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని వివరించారు. నగరంలో నూర్‌బాషా భవనం నిర్మించే బాధ్యత తనదేనన్నారు. నూర్‌బాషాలకు ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి తన వంతు కృషి చేసేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, పార్టీ నాయకులు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, మనుక్రాంత్‌రెడ్డి, నూర్‌బాషా జిల్లా అధ్యక్షుడు ఎస్కే సలీం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే మీరా సాహెబ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నారాయణ నామినేషన్ చెల్లదు

- తప్పుడు వివరాలతో అఫిడవిట్
- నామినేషన్ రద్దుకు ఈసీకి ఖలీల్ ఫిర్యాదు
- వైఎస్సార్‌సీపీ జాతీయ అధికార ప్రతినిధి కనుమూరి రవిచంద్రారెడ్డి



మాట్లాడుతున్న రవిచంద్రారెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): టీడీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి నారాయణ ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు వివరాలు ఇచ్చారని, ఆయన నామినేషన్ చెల్లదని వైఎస్సార్‌సీపీ జాతీయ అధికార ప్రతినిధి కనుమూరి రవిచంద్రారెడ్డి తెలిపారు. మాగుంట లేఅవుట్‌లోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నారాయణ విద్య, వైద్యాన్ని వ్యాపారంగా మార్చి అక్రమంగా సంపాదించారని ఆరోపించారు. తన ఆసుపత్రి, మెడికల్ కళాశాలలో లోకేశ్‌కు 50 శాతం వాటా ఇచ్చి అక్రమ సంపాదన చేసిన వ్యక్తి నారాయణ అన్నారు. నారాయణ ఆస్పత్రిలో ఎన్నో దురాగతాలు ఉన్నాయని, కరోనా సమయంలో బెడ్లు సైతం అమ్ముకున్నారని ఆరోపించారు. ఠాగూర్ సినిమా తరహాలో రోగులు మరణించినా బతికున్నట్లు నమ్మించి లక్షలు దండుకున్నారని, ఈ విషయంలో గొడవలు జరిగింది వాస్తవమా..కాదా అని ప్రశ్నించారు. ఈ విషయంపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. నారాయణకు ఇందిర భార్య కాదా, ఆమె కుమార్తె శారాణికి ఆయన కన్యాదానం చేయలేదా అని ప్రశ్నించారు. కుటుంబ సభ్యుల వివరాలను దాచిపెట్టి తప్పుడు అఫిడవిట్ సమర్పించిన నారాయణ నామినేషన్ చెల్లదని వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్ ద్వారా రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

మెరుగైన సంక్షేమం, అభివృద్ధి



ప్రచారం నిర్వహిస్తున్న నేహారెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపిస్తే రానున్న ఐదేళ్లలో మెరుగైన సంక్షేమం, అభివృద్ధి అందిస్తారని వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి అన్నారు. శనివారం ఆమె తన తండ్రికి మద్దతుగా నగరంలోని 6వ డివిజన్ శెట్టిగుంటరోడ్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తన తల్లి సునందరెడ్డి, స్థానిక కార్పొరేటర్ మద్దినేని మస్తానమ్మ, డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి శ్రీధర్‌తో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లూరుకు పరిశ్రమలను తీసుకొచ్చి స్థానికులకు 70 శాతం ఉద్యోగావకాశాలు కల్పించేలా, నెల్లూరును గ్రీన్‌సిటీగా రూపొందించేలా తన తండ్రి విజయసాయిరెడ్డి ప్రత్యేక ప్రణాళికను రూపొందించారని వివరించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా ఖలీల్ అహ్మద్‌ను గెలిపించాలని కోరారు. పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, రాష్ట్ర మహిళా విభాగం సెక్రటరీ హిమబిందు, కర్తం జ్యోతి, పద్మావతి పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత క్యాలెండర్ల అందజేత

నెల్లూరు(వీఆర్సీసెంటర్): త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక నెల్లూరు, దుత్తులూరు, పొదలకూరు కమిటీల సభ్యులు వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థులు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఖలీల్‌అహ్మద్, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్లను అందజేశారు.